వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 17 మే 2025


# అకాల వర్షంతో మామిడి రైతుల నష్టం

### ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు, కాయలు

ముద్దనూరు, మే,16 ప్రభాతవార్త:

పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్స్టేషన్ సమీపంలో ఐదు సంవత్సరాల మామిడి చెట్లు గురువారం అర్ధరాత్రి కురిసిన గాలి వానకు సుమారు 25 మామిడి చెట్లు నేలకొరిగి కాయలు రాలిపోయి అపార నష్టం వాటిలిందని రైతు తెలియజేశాడు. అదేవిధంగా మండల పరిధిలో గ్రామాలలో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు నేలకూరడంతో విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. వ్యవసాయ విద్యుత్తుకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తపరిచారు. విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు అక్కడక్కడ చేపడుతున్న పూర్తిస్థాయిలో చేపట్టలేదని ఉన్నతాధికారులు స్పందించి వెనువెంటనే సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.



# ఈనెల 20 జరిగే మెగా జాబ్ మేళా

### యువత సద్వినియోగం చేసుకోవాలి

### టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్ రాజు

రాజంపేట అర్బన్, మే16 ప్రభాతవార్త:

ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వార అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు ఈనెల 20న జరిగే మెగా ఉద్యోగా మెళ నిర్వహిస్తున్నట్లు తెలుగు దేశం పార్టీ రాజంపేట పార్ల మెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. నిరుద్యోగ యువతకు విద్యావ్యల ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ఉద్యోగమేళలో హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్, ఇండిగో ఎయిర్ లైన్స్ ,ఆధ్య హెచ్ ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్ సి, ఫోన్ పే ఫ్లిప్ కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత,ఆసక్తి, ఉన్నటువంటి యువతీ యువకులు ఈ ఉద్యోగామెళను సద్వినియోగం చేసుకోని తమ బంగారు భూషత్ బాటిల్ చేసుకోవాలని కోరారు.



# రాయలసీమను రతనాలసీమగా మార్చడమే ధ్యేయం

### రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

మదనపల్లి మే 16 ప్రభాత వార్త

రాయలసీమను రతనాల సీమగా మార్చడమే ప్రభుత్వ ధేయమని రాష్ట్ర జనవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం తంబళ్ళపల్లి నియోజకవర్గం దొమ్మన బావి వద్ద హంద్రీ నీవా పనులను మంత్రి పరిశీలించారు. ఎమ్మెల్యే షాజహాన్ భాష, నీటి పారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పలువురు టిడిపి నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం హంద్రీ నీవా పనులను పరిశీలించి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి ప్రజలకు సాగునీరు త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పరిపాలన దక్షత కలిగిన ముఖ్యమంత్రి వీటన్నిటిని అధిగమించి హంద్రీనీవా కాలువను పూర్తిస్థాయిలో పారించి ప్రజలకు తాగునీరు సాగునీరు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో కలిసి తంబళ్లపల్లె వద్ద ఉన్న దొమ్మనబావి వద్ద ఉన్న హంద్రీ నీవా ప్రాజెక్టును పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. నీటి నిల్వ ప్రాంతాలు, ట్యాంకు కింద ఉన్న భూములు తదితర విషయాలను అధికారులతో చర్చించారు. హంద్రీ నీవా ద్వారా 3850 క్యూసెక్కుల నీటి సరఫరాకు ప్రణాళిక రచించి 90 శాతం పనులను ఆనాటి టిడిపి ప్రభుత్వం పూర్తి చేస్తే మిగిలిన 10 శాతం పనులను గత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో కాలువల్లో చుక్క నీరు లేకుండా పోయిందన్నారు. సమ్మర్ స్టోరేజ్ వద్ద ఇసుకను దోపిడీ చేశారని ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేసి దోచుకున్నారన్నారు. అంతేకాకుండా ఇసుకను పూర్తిగా తోడెయ్యడంతో వర్షాధారం ద్వారా వచ్చే నీళ్ళు నిల్వ లేకుండా అడుగంటి పోవడం, లీకేజీ కావడం వంటివి జరుగుతాయన్నారు.భూగర్భ జలాల పెంపు సాగునీటి అవసరాల కోసం చెరువులను సంరక్షించాలని, రానున్న వర్షాకాలం కంటే ముందు చెరువుల్లోపూడికతీత పనులు చేపట్టాలని, మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీరు,




సాగు నీరు అందిస్తామన్నారు. ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి ప్రజలకు సాగునీరు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాయలసీమకు అత్యంత ప్రాధాన్యతీ రాయల సీమలో చివరి ఆయకట్టు వరకు నీరు అందించి ప్రతి ఎకరాకు సాగునీరు, త్రాగు నీరు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, జనసేన నాయకులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ ఎస్ఈ, ఈఈ, ఏఈలు,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

### జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన అర్జీదారులు



చిన్నమండెం, మే 16 ప్రబాతవార్త :

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం నందు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజల సమస్యలు పరిష్కారం కాక ఎన్నో కష్టాలు, కన్నీళ్లతో కాలం వెలదీసిన బాధితులకు నేడు ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. మంత్రి నిర్వహించిన ప్రజా దర్బార్ బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మంత్రివర్యులు ఉదయం 6 గంటల నుంచి ప్రజల అర్జీలు స్వీకరిస్తూ సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారు. ప్రజాదర్బార్ కు వందల సంఖ్యలో ప్రజలు వస్తున్నప్పటికీ ఏమాత్రం విసిగించుకోకుండా వారిని చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు వెళుతున్నారు. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు మంత్రి స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

# మహానాడు సభకు పనుల ఏర్పాట్లు



కమలాపురం మే 16 తర్వాత వార్త

కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మాదిన్నె మండలం ఔటర్ రింగ్ రోడ్ పబ్బాపురం పొలంలో మహానాడు సభ ఈ నెల 27, 28, 29 తేదీల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం పోలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్ప శ్రీనివాసరెడ్డి కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి కలిసి పరిశీలించారు. ప్రాంగణంలోని మైదాన అభివృద్ధి, వేదికలు, సాంకేతిక ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించగా, ఆయా ఏర్పాట్లు సమయానికి పూర్తి కావాలని, కార్యక్రమం గౌరవంగా, సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచనలు ఇచ్చారు. మహానాడును ప్రజల ఆకాంక్షలకు, పార్టీ కార్యకర్తల ఉత్సాహానికి తగిన విధంగా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఏర్పాటును సమగ్రంగా పర్యవేక్షిస్తున్నాము. పార్టీలో ప్రతి కార్యకర్తకు గౌరవం ఉంటుంది, ప్రజల ఆకాంక్షలకు ముఖ్యమైన ప్రాధాన్యత ఇస్తాం, అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ కణితి గర్భసంచి నుండి తొలగింపు,

### హెచ్ సి సి హాస్పిటల్ వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం.

మైదుకూరు, మే 16, ప్రభాతవార్త:



మైదుకూరులో గల హెచ్ సి సి హాస్పిటల్ వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. 44సం.ల వయసు గల వరలక్ష్మి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల హెచ్‌సిసి హాస్పిటల్ నందు చేరారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె కడుపులో 5 కిలోలకు పైగా బరువున్న భారీ కణితి గర్భసంచి నందు ఉన్నట్లు గుర్తించిన వైద్య బృందం, అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో శస్త్రచికిత్స చేపట్టింది. ప్రసూతి మరియు స్త్రీ వ్యాధుల నిపుణురాలు డా. కె.శ్రీ లలిత నేతృత్వంలో, డా. వీరనాథ్ రెడ్డి మరియు ఇతర వైద్య సిబ్బంది మూడున్నర గంటల పాటు శ్రమించి కణితిని విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్స అనంతరం రోగిని స్థిరంగా కాపాడగలిగినందుకు వైద్య బృందం సంతోషం వ్యక్తం చేసారు. ప్రస్తుతం రోగి పరిస్థితి స్థిరంగా ఉండి, త్వరితంగా కోలుకుంటారని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయం హెచ్ సి సి హాస్పిటల్ నైపుణ్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా, అన్ని రకముల సర్జరీలకు నిలయంగా నిలిచింది.

# సచివాయాలను తనిఖీ చేసిన డీఎల్‌పీఓ

దువ్వూరు, మే 16, ప్రభాతవార్త:




మండల కేంద్రమైన దువ్వూరులోని 1 సచివాలయాన్ని అలాగే గంగిరెడ్డి పల్లె గ్రామ పంచాయతీల కార్యాలయాలను శుక్రవారం జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క తనిఖీ చేసి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆమె గ్రామ పంచాయతీలో ఇంటి, నీటి పన్ను వసూళ్లు అలాగే పరిసరాల పరిశుభ్రత, చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు వంటి వాటిపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పన్నులు సకాలంలో చెల్లిస్తే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు అన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీఓ హరికృష్ణ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రాత్రింబవళ్ళు గస్తీ విధులు పటిష్టం చేయాలి

### పాత నేరస్థులపై నిఘా ఉంచాలి

### ప్రతిరోజు గ్రామాలు సందర్శించాలి

### జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

### చిన్నమండెం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ..

చిన్నమండెం మే 16 ప్రబాతవార్త :

రాత్రి వేళలో గస్తీ విధులు పటిష్టం చేసి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వి .విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం "చిన్నమండెం" పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కారాలను తదితర అంశాలను పరిశీలించి మహిళల సమస్యలకు ప్రాధాన్యత, ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు, పురోగతిపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ విధులను మరింత పటిష్టంగా నిర్వహించాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఎన్.బి.డబ్ల్యు ను త్వరగా అమలుపరచాలన్నారు. సమస్యాత్మక గ్రామాల పై దృష్టిసారించి గ్రామస్తులతో మమేకమై ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, గ్రామ సందర్శన, దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో కట్టడి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎం.వి చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి ట్రాఫిక్ నిబంధనలపై, రోడ్డు ప్రమాదం నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించాలని, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, పలు అంశాల పై జిల్లా ఎస్పీ .వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ కు పలు సూచనలు చేశారు.



### ఆపరేషన్ సింధూర్ విజయంతో

# దేశప్రజలు గర్విస్తున్నారు

### ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా వెల్లడి




మదనపల్లి మే 16 ప్రభాత వార్త

ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశ ప్రజలు గర్విస్తున్నారని, ఉగ్రవాదులు, పాకిస్తాన్ దేశంపైన మన దేశసైనికుల వీరత్వానికి సంఘీభావంగా శుక్రవారం నాడు మదనపల్లి పట్టణంలో తిరంగా ర్యాలీని ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా ఆధ్వర్యంలో టీడీపీ,బీజేపీ,జనసేన నాయకుల నేతృత్వంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుండి ప్రారంభించి ప్రధాన తపాలా కేంద్రం,బెంగళూరు బస్టాండ్ మీదుగా చిత్తూరు బస్టాండ్ వరకు చేపట్టారు.ఈ సందర్భంగా షాజహాన్ బాషా మాట్లాడుతూ పెహల్గమ్ ఉగ్రవాదుల దాడికి ప్రతిచర్యగా ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి,ముఖ్యమైన ఉగ్రవాదులను అంతమొందించి,భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ద్వారా అద్భుతమైన విజయంతో ప్రపంచానికి మన సైనిక శక్తిని చాటిచెప్పామన్నారు.ఉగ్రవాదులను అంతమొందించడంలో వీరమరణం పొందిన జవాన్లకు దేశ ప్రజల సలాం చేస్తున్నారన్నారు.వారి త్యాగం దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా మిగిలిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్,బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్,టిడిపి నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి, ఆర్.జె.వెంకటేష్, యర్రబల్లి వెంకటరమణా రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్, ఎస్.ఎం రఫీ, షంషీర్,రఘుపతి నాయుడు, తమ్మిశెట్టి రామకృష్ణ, ద్యాన్స్ రెడ్డెప్ప, జీవి నాయుడు, బీజేపీ నాయకులు బండి ఆనంద్,ఎల్లంపల్లి ప్రశాంత్, రూరల్ మండల అధ్యక్షుడు తరిగొండ వెంకటరమణారెడ్డి, జనసేన నాయకురాలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, పట్టణ ప్రజలు భారీస్థాయిలో పాల్గొన్నారు.

# యువ కాపునాడు అధ్యక్షునిగా సీతారాం బాబు

కురబలకోట మే 16 ప్రభాతవార్త

రాజంపేట పార్లమెంటరీ యువ కాపునాడు అధ్యక్షునిగా కురబలకోట మండలం అంగళ్ళకు చెందిన శెట్టి సీతారాంబాబు నియమితులయ్యారు ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ బలిజల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు వారి సమస్యలుపరిష్కరించేందుకు ముందు ఉంటానన్నారు బలిజల సంక్షేమానికి ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలి

రాయచోటి అర్బన్,మే 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మే మాసం థీమ్ ఉష్ణాన్ని నివారించే విధంగా 17న శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించాల్సిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణ, త్రాగునీరు, ఉపాధి హామీ, పల్లె పండుగ పనుల ప్రగతిపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాను చెత్త రహితంగా రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా ఈనెల 17న మూడవ శనివారం జిల్లాలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఉష్ణాన్ని నివారించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయితీ, మండలాలు, మున్సిపాలిటీలలో ప్రముఖ కూడళ్ళు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతరత్రా అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పరిశీలించి ప్రజలకు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. జన రద్దీ ఉన్న ప్రాంతాలలో ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్, మార్కెట్లు, బస్టాండు తదితర ప్రాంతాలలో ఎండ నుంచి రక్షణ నిచ్చే విధంగా షేడ్ నెట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.




## ఎంపీ లాడ్స్ ద్వారా
# మున్సిపాలిటీకి రెండు ట్రాక్టర్లు
### హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తా
### రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి

**రాజంపేట అర్బన్, మే16 ప్రభాతవార్త**

రాజంపేట రాయచోటి రోడ్ లో హిందూ స్మశాన వాటికకు కేటాయించిన స్థలం అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎంపీ లాడ్స్ ద్వారా 20 లక్షలు నిధులు కేటాయించేందుకు ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం మున్సిపల్ సమావేశానికి ఆయన వచ్చిన సందర్భంగా హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు దొంక సూరి, వర్ధి బోయిన బాబు, పట్టుపోగులు ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ నవీన్ కుమార్ లు ఎంపీ రఘునాథరెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నిధులు కేటాయించేందుకు ఆయన హామీ ఇచ్చారు. తన వంతు కూడా స్మశాన వాటిక అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే అమర్ రెడ్డి హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ ద్వారా నిధులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి మరోసారి ఇచ్చారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీకి ఎంపీ ల్యాడ్స్ ద్వారా కేటాయించిన నిధులతో రెండు ట్రాక్టర్లను ఎంపీ రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, వైస్ చైర్మన్ మర్రి రవి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రీజెన్సీలో టీచర్స్ ఓరియంటేషన్



**( అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )**

రాజంపేట రీజెన్సీ నలందా విద్యా సంస్థల్లో శుక్రవారం జరిగిన టీచర్స్ ఓరియంటేషన్ సమావేశం చైర్మెన్ డా. జీ. యన్ నాయుడు ఆధ్వర్యం లో జరిగింది. ఈ సమావేశం కు ఐఐఎం టాప్ ర్యాంకర్ డా. బార్ల వెంకటేశ్వర్లు, అహ్మదాబాద్ చే ఆధునిక విద్యా విధానాలు మరియు క్రమశిక్షణ గురించి ప్రత్యేక సమీక్ష అవగాహన కార్యక్రమం జరిగింది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉన్న మార్గాలను ఉపాధ్యాయుల అన్వేషించాలని తద్వారా గ్రామీణ స్థాయిలో కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా రాష్ట్ర ర్యాంకులు సాధించేందుకు వీలుందన్నారు. గత విద్యా సంవత్సరం రీజెన్సీ నలంద విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులకు ధీటుగా రాణించడం వెనుక కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం ప్రత్యేక కృషి ఉందన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో రోజురోజుకు మారుతున్న విద్యా విధానాన్ని అవగాహన చేసుకుని, తదనుగుణంగా విద్యార్థులు పరీక్షల్లో రాణించేందుకు ఉపాధ్యాయుల సమిష్టిగా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు హాజరు అయ్యారు .విద్యార్థిని , విద్యార్థుల కు చిన్న వయస్సులోనే ఐఐటి, జేఈఈ, ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అవసరమని డాక్టర్ బార్ల వెంకటేశ్వర్లు సూచించారు. అందుకు తగిన వసతులు అన్నీ రీజెన్సి నలంద సంస్థలలో ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. కావున దేశం నలుమూలల నుండి విద్యార్థులు ఈ సంస్థలలో విద్యను అభ్యసించడానికి ముందుకు వస్తున్నారని ప్రశంసించారు. కంప్యూటరు పరిజ్ఞానంతో నడిచే స్మార్ట్ బోర్డు వంటి అధునాతన పరికరాలను మరియు నిధులను ఏర్పాటు చేసి , విదేశాలలో చదువుకు ధీటుగా ఇక్కడ స్థానిక విద్యాలయంలో చేయడానికి అన్నీ హంగులు ఏర్పాటు చేయడాన్ని ఆయన అభినందించారు. ఆద్యాపకులకు అధునాతన సాంకేతిక నైపుణ్యం నేర్పించాలనీ, డిజిటల్ లైబ్రరీలు మరియు ఐఐటి వంటి సంస్థల ద్వారా లభ్యం అవుతున్న వీడియో పాఠ్యాంశాలను అదనంగా ఏర్పాటు చేసుకోవాలని డాక్టర్ బార్ల వెంకటేశ్వర్లు సూచించారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో కళాశాల సి ఎ ఓ గుదారు విజయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర జనరల్ సర్జరీ విజయవంతం

**కలికిరి, మే 16, ప్రభాతవార్త:**

కలికిరి ఆసుపత్రిలో శుక్రవారం వైద్యాధికారులు నిర్వహించిన అత్యవసర జనరల్ సర్జరీ విజయవంతం అయినట్లు కలికిరి ఆసుపత్రి సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కలికిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 27 ఏళ్ల వ్యక్తికి కడుపు నొప్పి వచ్చింది. ఆల్ట్రాసౌండ్ రిపోర్టులో తీవ్రమైన అపెండిసైటీస్ ఉన్నట్లు తేలింది. అత్యవసర శస్త్ర చికిత్స కోసం డా.ఉదయ్‌కిరణ్, డా.వెంకటేష్‌లను అభ్యరించి జనరల్ సర్జన్ అయిన డా. ఉదయ్ కిరణ్, అనస్టీసియాలజిస్ట్ డా.వెంకటేష్, వైద్యుడు డా.శశికుమార్ రాజు, ఓటీ స్టాఫ్‌నర్సు ఉమా మహేశ్వరీ, ఓటీ టెక్నీషియన్ కృష్ణ చైతన్య సహాయంతో అత్యవసర అపెండెక్టమీని నిర్వహించామన్నారు. డ్యూటీ పనివేళల తరువాత జరిగిన మొట్టమొదటి అత్యవసర జనరల్ సర్జరీ ఆపరేషన్. రోగి ప్రాణాలను కాపాడడంలో తక్షణ జోక్యం చేసుకున్నందుకు డాక్టర్ ఉదయ్ కిరణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# డెంగ్యూ వ్యాధిపై అవగాహన

**వేంపల్లె మే,16:(ప్రభాత వార్త)**

డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తాళ్లపల్లి పిహెచ్సి వైద్యురాలు డా.లక్ష్మీప్రియా వెల్లడించారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు డెంగ్యూ వ్యాధి నివారణకు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ ని ఓడించండి, పరిశీలించండి, శుభ్రం చేయండి.. మూతలు పెట్టండి అనే అంశాలపై ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేశారు. అనంతరం డా.లక్ష్మీ ప్రియా మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. రానున్న వర్షకాల నైపధ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రైడే పాటించాలని కోరారు. నీటి కుంటల్లో గాంబుజీయా చేపలు వేయించుకోవాలని, ఆకస్మిక జ్వరం విపరీతమైన కండరాలు, కీళ్లు, కళ్ల నొప్పులు, వాంతులు డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరిక్షలు చేయించు కోవాలన్నారు. పరిసరాల పారిశుద్ధం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా, సిహెచ్ఓ వెంకటరత్నం, సూపర్వైజర్లు ఫకృద్దీన్, వెంకటలక్ష్మి, అరుణాదేవి, అంకయ్య, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



# శ్రీ మూలస్థానమ్మ అమ్మవారి జాతరపై తొలగని ఉత్కంఠ

**కలికిరి, మే 16, ప్రభాతవార్త:**

మండలంలోని గుండ్లూరు గ్రామంలో గ్రామదేవతగా వెలసిన శ్రీ మూలస్థానమ్మ అమ్మవారి జాతరపై ఉత్కంఠ నెలకొంది. గ్రామంలో ధర్మకర్తల మధ్య సయోధ్య ఏర్పడకపోవడంతో జాతర ఎవరు నిర్వహిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. గతంలో 2009లో ధర్మకర్త వెంకటేశ్వరరెడ్డి శిథిలావస్థలో ఉన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించి రూ.40లక్షలతో ఆలయ అభివృద్ధి చేపట్టారు. తిరుపతికి చెందిన రాజశేఖర్‌రెడ్డి సహకారంతో ఆలయ ప్రాంగణంలో వినాయక స్వామి గుడిని నిర్మించారు. తరువాత ఆలయ ధర్మకర్తలుగా వీఆర్ పార్వతమ్మ, వీఆర్ భాస్కర్‌రెడ్డిలు వ్యవహరించారు. గతంలో ఆలయ అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు ఉన్న బోర్డుపై పెయింట్ వేయించి కనబడకుండా చేశారు. అదే విధంగా ఆలయానికి సంబంధించిన వివరాలు కానీ చెప్పకుండా గోప్యంగా ఉంచారు. అమ్మవారి కిరీటం కానీ, పలు అంశాలపై వివరణ అడిగినా చెప్పలేదని వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అమ్మవారి జాతర నిర్వహించేందుకు వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి ముందుకు రావడం, లేదు తామే నిర్వహిస్తామని వీఆర్ పార్వతమ్మ, భాస్కర్‌రెడ్డిలు ముందుకు రావడం జరగడంతో జాతర ఏర్పాట్లలో ఉత్కంఠ నెలకొంది. దీంతో మరో సారి గ్రామ పెద్దలు సతీష్‌రెడ్డి, ఆర్.మురళీనాథ్‌రెడ్డి, ఆర్.భాస్కర్‌రెడ్డి, వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, వీఆర్ పార్వతమ్మ, వీఆర్ భాస్కర్‌రెడ్డిలు గ్రామస్థుల సమక్షంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మరో వ్యక్తి అయిన రామ్మోహన్‌రెడ్డి జాతర నిర్వహించే విధంగా నిర్ణయించారు. కానీ వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి పెయింటింగ్‌తో దాతల వివరాలు కనపడకుండా తీసేయాలని ఆలయ విరాళాలు తెలపాలని అప్పుడే జాతర నిర్వహించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. దీంతో జాతర తేదీ ఖరారు అయిందని అందరూ ఊహించుకున్నప్పటికీ వెంకటేశ్వరరెడ్డి అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో సీఐకి ఫిర్యాదు చేసి వివరాలు అందేలా చూడాలని ఫిర్యాదు చేశాడు. దీంతో మరో సారి ఉత్కంఠ నెలకొంది. జాతర ప్రశాంత వాతావరణంలోజరపాలని కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, పెద్దలకు సూచించారు. శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులకు గ్రామ పెద్దలుగా సహకరించాలని గ్రామ పెద్దలే ధర్మకర్తలు సమన్వయంతో జాతర జరిగేలా నిర్ణయం తీసుకొని తమకు తెలిపితే జాతర ప్రశాంత వాతావరణంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జరిపిస్తామని సీఐ తెలిపారు.

# వినియోగదారుల ఫోరంకు అరెస్ట్ వారెంటు జారీ చేసే హక్కు లేదు

(వినియోగదారుల ఫోరం పరిమితులను స్పష్టం చేసిన కలకత్తా హైకోర్టు)

**బద్వేలు లీగల్, మే 16 ప్రభాతవార్త :**

వినియోగదారుల ఫోరంకు అరెస్టు వారెంటు జారీ చేసే అధికారం లేదని కలకత్తా హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే సాధారణ జైలులో నిర్బంధించాలంటూ ఉత్తర్వులు ఇచ్చేందుకు మాత్రమే అధికారం ఉంటుందని తెలిపింది. తన ఆదేశాల అమలు కోసం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ క్రింద వారెంటు ఇచ్చేందుకు వినియోగదారుల ఫోరంకు అధికారం లేదని కూడా పేర్కొనింది. ఇలాంటి ఆదేశాలు వినియోగదారుల రక్షణ చట్టంలో నిర్దేశించిన నిబంధనల పరిధిని అతిక్రమించడమే అవుతుందని కూడా వెల్లడించింది. జిల్లా వినియోగదారుల పరిష్కార వేదిక ఇచ్చిన అరెస్టు వారెంటును అప్పీలు చేస్తూ ఓ బాధితుడు దాఖలు చేసిన పిటీషన్‌పై ధర్మాసనం విచారిస్తూ అరెస్టు వారెంటును రద్దు చేసి ఈ తీర్పును వెలువరించింది. వివరాలలోకి వెళితే... ఓ వ్యక్తి ట్రాక్టరు కొనుగోలు కోసం 2013 లో ఓ ఫైనాన్స్ కంపెనీ నుండి అప్పు తీసుకున్నాడు. సదరు ట్రాక్టర్ యజమాని సదరు బాకీ చెల్లించలేదంటూ ఫైనాన్స్ కంపెనీ ట్రాక్టర్‌ను స్వాధీనము చేసుకుంది. దీంతో బాకీని పూర్తిగా చెల్లించిన ట్రాక్టర్ యజమాని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి తన ట్రాక్టరు రిజిస్ట్రేషన్ తిరిగి ఇప్పించాలని పిటీషన్‌లో కోరాడు. అయితే వినియోగదారుల ఫోరం ఆదేశాలను ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకుడు పట్టించుకోకపోగా దీంతో ఫోరం కంపెనీ నిర్వాహకుడికి అరెస్ట్ వారెంటు జారీ చేయడంతో దీనిని కలకత్తా హైకోర్టులో అప్పీలు విచారణ సందర్భంగా ఫోరం జారీ చేసిన వారెంటును ధర్మాసనం కొట్టివేస్తూ ఈ తీర్పును వెలువరించింది. (అబ్దుల్ మనీం మొల్లా ఎదిరి స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ మరియు ఇతరులు సిఆర్‌ఆర్ 1499 ఆఫ్ 2024).

# జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలి



**బద్వేల్ అర్బన్, మే 16 , ప్రభాతవార్త**

బద్వేల్ మండలం గొడుగునూరు గ్రామం నందు ఈ నెల 18వ తేదీ జరగబోయే పోలేరమ్మ జాతర సందర్భంగా బద్వేల్ రూరల్ సిఐ నాగభూషణ్ మరియు బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ లు శుక్రవారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇస్తూ 18వ తేదీన జరగబోయే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, విభేదాలన్నీ పక్కనపెట్టి కలిసికట్టుగా జాతర జరుపుకోవాలని తెలిపారు. అలాగే శాంతి భద్రతల సమస్య రాకుండా చూసుకోవాలని గ్రామ పెద్దలకు మరియు ప్రజలకు సూచించారు.

# నేడు జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్రను జయప్రదం చేయండి

**బద్వేల్ అర్బన్, మే 16, ప్రభాతవార్త**



ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమరియు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు శనివారం బద్వేలులో ని పలు ప్రభుత్వ కార్యాలయాలు సచివాలయాలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించడం జరుగుతుందనీ అందులో భాగంగా " వేడి ప్రభావాలను తగ్గించడానికి, ప్రజలలో అవగాహన పెంచడానికి మరియు పట్టణ మరియు గ్రామీణ స్థితిస్థాపకతను మెరుగుపరచడానికి దృష్టి సారించిన కార్యకలాపాలను చేపట్టనున్నట్లు తెలిపారు.కావునా ఈ కార్యక్రమానికి అందరూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు మరియు విధ్యా సంస్థల అధిపతులు ,వ్యాపారులు, స్వచ్ఛంధ సంస్థలు,మేధావులు ,అందరూ సచివాలయ సిబ్బంది, మెప్మాసిబ్బంది మరియు ప్రజలు హాజరై జయప్రదం చేయవలసింది గా కోరారు.

# ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు

**సుండుపల్లి, మే 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ నందు పి సి ఎస్ ఎస్ టి ఐ ఎన్జీవో ఆధ్వర్యంలో హెచ్ ఐ వి/ఎయిడ్స్, ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ పి సి ఎస్ ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా సుండుపల్లి పోలీస్ స్టేషన్ నందు ఎస్సై ముత్యాల. శ్రీనివాసులు సహకారం తో పి.అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజరు టి. స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది ఎలా వ్యాపించదు ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను తెలపడం జరిగింది. అలాగే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించే విధంగా సహకరించాలని ఆమె కోరారు. ఎయిడ్స్ వ్యాధి మరియు సుఖ వ్యాధుల యొక్క వివరాలను తెలియజేశారు కండోమ్ యొక్క ఉపయోగాలు మరియు ఎయిడ్స్ యాక్ట్ 2017 ఏ ఆర్ టి మందులు ఏపీ ఎస్ ఏ సి ఎస్ యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓ ఆర్ డబ్ల్యు జై. సుహాసిని, పి ఇ రమణమ్మ పాల్గొన్నారు



# గోవిందరెడ్డికు డాక్టరేట్ ప్రధానం

**బద్వేల్ అర్బన్ మే 16 ప్రభాతవార్త :**



శ్రీ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్య వై.వి.రామిరెడ్డి పర్యవేక్షణలో " ఫిజికో కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ ఆర్గానిక్ లిక్విడ్ మిక్సర్ త్రూ ఎఫ్.టి.ఐ.ఆర్ స్పెక్ట్రల్ అనాలసిస్ " అనే అంశంపై పరిశోధన చేసినందుకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు బద్వేల్ మండలం పోలుగారిపల్లె గ్రామమునకు చెందిన కత్తెరపల్లె రామిరెడ్డి చెన్నమ్మ ల కుమారుడు గోవిందరెడ్డి కి డాక్టరేట్ ను ప్రదానం చేయడం జరిగింది. గోవిందరెడ్డి కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. పాఠశాల సహాయకులుగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన గోవిందరెడ్డి, ఆ తర్వాత జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. పోరుమామిళ్ల, బద్వేలు, ప్రాంతాలలో పనిచేసి ప్రస్తుతం కడపలో బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా గోవింద రెడ్డి మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో డాక్టరేట్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రసాయన శాస్త్రం పట్ల తనకున్న ఆసక్తే దానిపై పరిశోధన చేయడానికి తోడ్పడిందన్నారు. ఈ పరిశోధన ద్వారా రసాయనిక శాస్త్రంలో మరిన్ని విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు.

# వారిపై చెడు ప్రభావం పడేలా..



**ఏం తల్లో ఏమో! పిల్లలను సరిగా పట్టించుకోదు.. సమయానికి వండి పెట్టదు.. అంత చిన్న వాళ్లపై దెబ్బ ఎలా వేయాలనిపిస్తుందో.. పక్కవాళ్లు తమ చిన్నారు లతో ప్రవర్తించే తీరుపై ఇలా ఎప్పుడోకప్పుడు ఇంట్లో మాట్లాడు కుంటూనే ఉంటాం కదా? మన పెంపకం తో పోలిస్తే ఆ పిల్లలకు ఏదో అన్యాయం జరిగి పోతోందని భావిస్తాం కానీ.. అది మనవాళ్లపై చెడు ప్రభావం పడేలా చేస్తుందని తెలుసా?**

తమ పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా పెరగాలనే ఏ తల్లి అయినా కోరుకునేది. ఎంత ఓపికగా ఉందామనుకున్నా కొన్నిసార్లు శరీరం సహకరించకపోవడం, కుటుంబ పరిస్థితులు వగైరా సహనాన్ని కోల్పోయేలా చేస్తాయి. దాంతో ఓ దెబ్బ వేస్తారు. పోనీ.. ఆఫీసులోనో, బయటికి వెళ్లినప్పుడో ఆలస్యమవుతుంది. దీంతో కాస్త ఆలస్యంగా వండి పెట్టారు. ఇవన్నీ తప్పా ఒప్పా అన్నది పక్కన పెడితే. వీటి గురించి పదే పదే మాట్లాడితే ఆ దుష్ప్రభావం పడేది మీ పిల్లల మీదే చిన్నారులకు అమ్మానాన్నలే తొలి మార్గదర్శకులు. చాలా విషయాలు మిమ్మల్ని చూసే నేర్చుకుంటారు. మీరిలా వాళ్ల తీరు బాలేదు అని అసహనాన్ని చూపిస్తున్నాం అనుకుంటున్నారు కానీ. పిల్లలకీ ఆ అసహనాన్ని తెలియకుండానే అలవాటు చేస్తున్నారు. దీంతో వాళ్లు అన్నకున్నది ఏది జరగకపోయినా దాన్నే ఇంట్లోనూ ప్రదర్శింస్తుంటారు. ఆ ఇంటి పరిస్థితులు మనకు తెలియదు.. అయినా జడ్జ్ చేసేసైతం. అంటే అవతలివాళ్లవైపు నుంచి ఆలోచించాల్సిన అవసరం లేదన్నది

నేర్పిస్తున్నట్లేగా?

పైగా వాళ్లఇక ఏది ఇవ్వకపోయినా మంచి అమ్మానాన్నలేనా అని ఆలోచిస్తారట. ఇతరుల తల్లిదండ్రులు అన్నీ అమరుస్తుంటే వాళ్లే సరైన అమ్మానాన్నలు అనీ భావిస్తారట. అంతేకాదు, చిన్న చిన్న విషయాలకే నెగెటివ్‌గా ఆలోచించడం నేర్చుకుంటారనీ చెబుతున్నారు నిపుణులు. కాబట్టి, పిల్లల ముందు అలా ఇతర తల్లిదండ్రుల గురించి నిందిస్తూ మాట్లాడొద్దు. ఇంకా వీలుంటే వాళ్ల లేనప్పుడో,ఆరోగ్యం బాలేనప్పుడో వీలైనంత సాయం చేయండి. ఇతరులతో మంచిగా మెలగడం, సాయం చేయడం వంటివి నేర్పినవారవుతారు.

# ఒక్క ఆపిల్‌లో..



ఒక్క ఆపిల్ లో పదికోట్ల బ్యాక్టీరియా ఉంటుంది. రోజుకో ఆపిల్ తింటే.. ఎన్నో రకాల వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని మనకు తెలుసు. కానీ, ఒక్క ఆపిల్‌ను తింటే 10 కోట్ల బ్యాక్టీరియాలు మన పొట్టలోకి చేరినట్టే అని మీకు తెలుసా! మరీ అంత ఆశ్చర్య పోకండి. అదంతా మనకు మంచి చేసే బ్యాక్టీరి యానే! అవును .. 240 గ్రాముల బరువున్న ఒక ఆపిల్‌లో సుమారు 10 కోట్ల బ్యాక్టీరియా ఉంటుందట. తాజాగా ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఆపిల్‌లోని కాడ, గుజ్జు, విత్తనాలు, తొక్క.. ఇలా ప్రతి భాగమూ.. బ్యాక్టీరియా మయమేనట. ఇక గుజ్జు, విత్తనాలైతే బ్యాక్టీరియా హాట్‌స్పాట్‌లే. అయితే, సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆపిల్ రకాలే ఉత్తమం అంటు న్నారు పరిశోధనలు. ఎందుకంటే, ఈరెండు రకాల ఆపిల్ పండ్లలో బ్యాక్టీరియా సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, అందులో ఉండే మంచి బ్యాక్టీరియాలో మాత్రం తేడా ఉంటుందట. పంట పండే ప్రాంతం, భద్రపరిచే విధానాలను బట్టి వాటిలోని మైక్రోబయోమ్‌ల కంపోజిషన్ మారిపోతుందట.

# డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ




**దువ్వూరు, మే 16, ప్రభాతవార్త:**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సంధర్భంగ గ్రామంలో అవగాహణ ర్యాలీ నిర్వ హించారు. ఈ సంధఋంగా వైద్యాధికారులు డాక్టర్ సురేష్ బాబు, వికసిత, హేమలత, రోషిణీలు మాట్లాడుతూ ప్రజలు డెంగ్యూ బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దీనిపైన సచివాలయంలో డెంగ్యూ ఎలా వస్తుంది దాని నివారణ మార్గల గురించి ప్రజలకు వివరించారు. నీటి తొట్టులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లార్వా పుట్టకుండా నివారించాలని దోమ కుట్టకూడదని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్య సిబ్బంది చంద్రమౌళి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగిని పరామర్శించిన శ్రీకాంత్ రెడ్డి



**లక్కిరెడ్డిపల్లె; ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

వైఎస్ఆర్సిపి మైనార్టీ నాయకులు జాకీర్ బామ్మర్ది , సచివాలయ ఉద్యోగి వాజిద్ ఇటీవల విద్యుత్ షాక్ కు గురై గాయాల పాలై చికిత్స నిమిత్తం విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో శుక్రవారం వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబా బత్తిన రెడ్డయ్య లు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు పై ఆరా తీసి సంబంధిత శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి క్షతగాత్రుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ శంకర్ నాయుడు, సర్పంచ్లు వెంకటనారాయణ రెడ్డి , జనార్దన్ రెడ్డి , మైనార్టీ నాయకులు చాన్ భాషా, ఉపసర్పంచ్ రాజా రెడ్డి, తదితరులు ఉన్నారు.

# బ్రాహ్మణ లకు అవకాశం కల్పించండి

### బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకుల

**వేంపల్లి: మే 16 (ప్రభాతవార్త)):**



రాజకీయంగా బ్రాహ్మణులు ఎదగడానికి ప్రస్తుత రాజకీయాలలో పార్టీ అండ చాలా అవసరమని అందువల్ల బ్రాహ్మణులకు తెలుదేశం పార్టీ అవకాశం ఇచ్చి వారికీ రాజకీయ జీవితం ఇవ్వాలని తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, కార్యదర్శి నారా లోకేష్‌ను కోరుతున్నట్లు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు సూగురు రఘునాథరావు, పి వి ఎస్ వి. ప్రసాదరావు లు ఒక ప్రకటన లో కోరారు. గత ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులు మెజారిటీ సంఖ్య లో తెలుగు దేశం పార్టీ కి మద్దతుగా నిలిచారని, వోటింగ్ లో ఎక్కువ శాతం తెలుగుదేశం కు అనుకూలం గా ఓటు వేశారని తెలిపారు. చాలామంది బ్రాహ్మణులు 1983 నుండి పార్టీ లో వుంటూ మద్దతుగా వున్నారని తెలిపారు. మే నెల ఆఖరు నాటికీ పార్టీ పదవులు నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ప్రకటించినందున ఈ విడతలో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. అటు పార్టీ లో మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పదవుల లో మరియు నామినేటెడ్ పదవులు లో అవకాశం ఇవ్వాలని కోరారు. రాజకీయ ల పట్ల బ్రాహ్మణలకు ఆసక్తి వున్నా, ఆర్థిక స్థితి లేక ఎంతో మంది ముందుకు రాలేక పోతున్నారని, అటువంటి వారికి, పార్టీ కి విధేయత వున్నవారికి అవకాశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు కడప పర్యటన లో ఈ మేరకు వినతి పత్రం కూడా ఇచ్చామని వారు పేర్కొన్నారు.

# కృష్ణయ్య భౌతికకాయనికి జనసేనాని..

**సుండుపల్లి, మే 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామపంచాయతీ వడ్లపల్లిలో మండల రైతుసంఘం అధ్యక్షులు మరియు సీనియర్ రాజకీయ అనుభవజ్ఞులైన పెనుబాల శ్రీనివాసులు తమ్ముడు కృష్ణయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం జనసేనపార్టీ సీనియర్ నాయకులు రామ శ్రీనివాస్ ఆయన మృతదేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరామ్ నాయుడు బీసీ నేత మంగిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

**బద్వేలు, మే 16, ప్రభాత వార్త**

నెల్లూరు జిల్లా కదిరి నాయుడు పల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదివేలకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. బైకు అదుపుతప్పి కింద పడడంతో గాయాల పాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు గాయపడిన వారిలో పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన సింగార మహేష్, వల్లెల వారి పల్లెకు చెందిన సుధీర్ లుగా గుర్తించారు

# నేడే ఆదిపరాశక్తి కొత్తపురమ్మ తిరుణాల..

**సుండుపల్లి, మే 16, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఎగువ ఈడిగపల్లె దక్షిణ భాగాన వెలసియున్న ఆదిపరాశక్తి తిరుణాల జరుగుతుందని గ్రామస్తులు తెలియజేశారు. శనివా రం ఉదయం అమ్మవారికి పూజలు అభిషేకములు నిర్వహించి రాత్రికి భజ న కార్యక్రమాలు ఉంటాయని, అలాగే రాత్రికి విద్యుత్ దీపాలతో మేళ తాళాలు కోలాటాల మధ్య బాణాసంచా కాలుస్తూ చాందిని బండ్లు తిరుగు తాయని, కావున భక్తులందరూ వచ్చి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించ వలసినదిగా గ్రామస్తులు కోరారు.

# ఈసెట్ ప్రవేశ పరీక్షలో శ్రీ సాయి పాలిటెక్నిక్ విద్యార్థుల విజయ కేతనం

రాయచోటి అర్బన్, మే 16 ప్రభాతవార్త



శ్రీ సాయి పాలిటెక్నిక్ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఈ సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనపరిచారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుండి సాయి కళ్యాణి512 ర్యాంకు, స్వరూప లహరి 652 ర్యాంక్, సభా ఫిర్దోస్ 708 ర్యాంక్, మెకానికల్ విభాగం నుండి సి.మహేష్1903 ర్యాంక్, ఎలక్ట్రికల్ విభాగం నుండి నిసార అహ్మద్ 1276, మరియు సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుండి ముషారఫ్ అలీ 1585 ర్యాంక్ సాధించారని కళాశాల డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంతే కాకుండా కళాశాలలో కమ్యూనికేషన్స్ స్కిల్స్, అర్థమెటిక్, ప్రాజెక్టు ఇంటర్న్ షిప్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నామని వివరించారు. ఈసెట్ ప్రవేశ పరీక్షలు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, పాలిటెక్నిక్ విభాగపు ఇంచార్జ్ వి. ప్రతాప్‌రావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# పేదలను ఆదుకోవడమే ముఖ్య ఉద్దేశం

ఒంటిమిట్ట మే 16( ప్రభాతవార్త)



మండలం మలకాటపల్లి గ్రామ శివార్లలో ఉన్న నూరుల్లా ఇస్లామిక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ శుక్రవారం పేద ప్రజలకు ఇమాములకు, మోజాములకు కుల మతాలకు అతీతంగా ట్రస్ట్ అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ పెన్షన్ ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ సృష్టిలో పుట్టిన ప్రతి ఒక్కరికి దాన గుణం కలిగి ఉండాలని ఒకరినొకరు స్నేహపూర్వకంగా ఉంటూ సహాయం చేసుకోవాలన్నారు. నిత్యవసర వస్తువుల్లో భాగంగా ఒట్టి మిరపకాయలను పేదలకు పంచడం జరిగింది. అదేవిధంగా పేద ప్రజల సౌలభ్యం కొరకు ఆయుర్వేద వైద్యశాలను నిర్మించడం జరిగిందని ఎటువంటి రోగాలనైనా ఆయుర్వేద చికిత్స తో నయం చేయవచ్చున్నాడు. చేసిన పుణ్యం ఎక్కడికి పోదని దాన్ని ఎవరు దొంగలించలేరని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నాడు. కావున అంగ వైకల్యం కలిగిన వారికి, అనాధలకు, వృద్ధులకు మేమున్నామంటూ చేయూత నిచ్చి కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నాడు. దాతలు సహకరిస్తే ఎక్కువమంది పేదలకు దానం చేసే అవకాశం లభిస్తుందన్నాడు.

# పరిసరాల పరిశుభ్రత ధ్యేయం

## డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా దోమల నివారణతోనే సాధ్యం



ముద్దనూరు, మే 16, ప్రభాతవార్త:

డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా లార్వాదశ నుంచే దోమల నిర్మూలనే ధ్యేయంగా వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి వారి సహకారంతోనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అంతర్జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా వైద్యాధికారులు నాగార్జున, శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశీలించి మురికి నీరు నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ పరిధిలోని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్,ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ రామారావు, స్టాఫ్ నర్స్ రమాదేవి,ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, వైద్య సిబ్బంది ఇందిరమ్మ, అపర్ణ, ఆశా కార్యకర్తలు సంధ్య నీల వేణి, విజయ, భారతి, అటెండర్ సుబ్బారాయుడు 6వ వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన దుర్గమ్మ తల్లి వార్షికోత్సవం

గాలివీడు, మే 16(ప్రభాతవార్త):



మండల పరిధిలోని గుండ్లచెరువు గ్రామం పెద్దచెరువు ఒడ్డున వెలసిన గ్రామ దేవత శ్రీ దుర్గాదేవి 12వ వార్షికోత్సవాన్ని గ్రామ ప్రజలు, వేదపండితులచే ఘనంగా ప్రారంభించారు. శుక్రవారం అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాభిషేకాలు నిర్వహించారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నప్రసాదాల వితరణ కార్యక్రమం జరపబడున్నారు. ఆదివారం అలంకరించిన చాందినీబండ్లను ఊరేగిస్తూ మొక్కుల రూపంలో అమ్మవారికి బోనాలు సమర్పించుకుంటారు. వార్షికోత్సవం సందర్భంగా గ్రామం అంతా పండుగ వాతావరణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

# డిగ్రీ కళాశాల అఫిలియేషన్‌ని రద్దు చేయాలి

ఎడ్యుకేషన్ మే 16 ప్రభావత వార్త :




యోగి వేమన యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బ్రహ్మంగారి మఠం లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల అఫిలియేషన్‌ని రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) ఆధ్వర్యంలో యోగి వేమన యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా (ఏ.ఐ.ఎస్.బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ. బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యూనివర్సిటీ అధికారులను మోసం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఒక చోట అనుమతి ఉంటే మరొక చోట తరగతులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా, అధికారులను మోసం చేస్తూ సత్రంలో తరగతులు నిర్వహిస్తున్నటువంటి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కళాశాలలో సెల్ఫ్ సెంటర్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# దోమల నివారణతోనే డెంగ్యూ వ్యాధి దూరం

మదనపల్లిక్రైమ్, మే 16 ప్రభాతవార్త.

దోమల నివారణతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని డిప్యూటీ డి.ఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని కార్యక్రమంలో భాగముగా త్యాగరాజ స్ట్రీట్ పట్టణ ఆరోగ్య కేంద్రములో అవగాహనా సమావేశము, ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎమ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ దోమల నివారణతోనే డెంగ్యూ వ్యాధిని అంతం చేయవచ్చున్నారు. డెంగ్యూ వ్యాధి దోమకాటుతో వస్తుందని, అది ప్రాణాంతకమైన వ్యాధి అన్నారు. మురుగునీటి గుంతలను శుభ్రపరచాలన్నారు, నీరు నిల్వ ఉన్న గుంతలను క్రమంగా శుభ్రపరిచి, లార్వా దశలోని దోమలను నివారించాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు. మూడు రోజులకు మించి నీరసంగా ఉన్న, జ్వరము ఉన్న వెంటనే రక్త పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్, మదనపల్లె, డా. జిలాన్, సార్ వైద్యాధికారి, ఖలీలుల్లాహ్ ఖాన్, సబ్ యూనిట్ అధికారి, రెడ్డెమ్మ, పర్యవేక్షకులు హెల్త్ సెక్రటరీలు, ఆశ లు పాల్గొన్నారు.

# దిగువపాలెం టిడిపి అధ్యక్షుడుగా నాగేంద్ర

తంబళ్లపల్లె మే 16 ప్రభాతవార్త ః



దిగువపాలెం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా నాగేంద్ర నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి విలేకరులకు తెలిపారు. శుక్రవారం గ్రామంలో జరిగిన పార్టీ కమిటీ ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా శశి కుమార్ నాయుడు, కార్యదర్శిగా అనిల్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు తమ ఎన్నికలకు సహకరించిన తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జై చంద్రారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కాలా నారాయణ, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా నాయకురాలు సిద్ధమ్మ, క్లస్టర్ ఇంచార్జ్ కాలా నారాయణ, మధు నాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవగాహన కార్యక్రమం

సిద్ధవటం మే 16 ప్రభాతవార్త:



మండలంలోని మాచుపల్లి గ్రామంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పి కొత్తపల్లి వైద్యాధికారి రంగ లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వైద్య అధికారి రంగ లక్ష్మి మాట్లాడుతూడ దోమలు ఉత్పత్తి చెందకుండా నీరు నిలువ లేకుండా మీ పరిసర ప్రాంతాల్లో పెట్టుకోవాలని సూచించారు సబ్ యూనిట్ మలేరియా అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ నీరు నిల్వ ఉంటే తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉంచాలని, గృహాల చుట్టుపక్కల దోమలు ఉత్పత్తి నీటి ప్రాంతాలను తొలగింపు చేపట్టాలని, రాత్రి వేళలో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని అన్నారు దోమలు కుట్టడం వలన ఐదు రకాల గల చికెన్ గున్యా డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ బోదకాలు వంటివి వ్యాప్తి చందే అవకాశం ఉందని ప్రజలకు ఆరోగ్య బోధనపై జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నరసమ్మ, సూపర్వైజర్లు, మోలాలి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు, రెడ్డి రాణి, మేరీ వాసవి, ఆశా వర్కరు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బాధ్యత భావించాలి



సమావేశంలో మాట్లాడు తున్న సూపర్వైజర్ స్వరూప

పీలేరు మే 16 ప్రభాతవార్త:

కిశోర బాలికల వికాసాన్ని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని అజంతా టాకీస్ అంగన్వాడి కేంద్రంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కిశోర బాలికలు, తల్లులను ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్వైజర్ కిషోర్ బాలికలకు అవగాహన కల్పిస్తూ న్యూట్రిషన్, వ్యక్తిగత పరిశుభ్రత అవసరాలతో పాటు బాల్యవివాహాల నివారణ, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల వయస్సు నిండాకే పెళ్లి చేయాలని తెలియజేశారు. జి.ఎం.ఎస్.కె షర్మిల మాట్లాడుతూ సైబర్ క్రైమ్, పిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ వర్కర్ డి. లావణ్య మాట్లాడుతూ పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్, 1098కి ఎలా కంప్లైంట్ చేయాలి అనేదానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, తల్లులు, అంగన్వాడి కార్యకర్తలు కె. చిన్నమ్మ, జి. లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ

పీలేరు మే 16 ప్రభాతవార్త:

పీలేరు మండలంలోని చౌకదుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువుల పంపిణీ ఈ నెల 17వ తేదీ (శనివారం)తో ముగియనుందని, చౌక దుకాణాల ఓనర్ల సంఘం కార్యదర్శి వెంకటరమణ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనేక చోట్ల నిత్యావసర సరుకుల నిల్వలు ఉన్నప్పటికీ, వేసవి తీవ్రత కారణంగా కొంతమంది కార్డుదారులు ఇంకా సరుకులు పొందలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, మండల కేంద్రమైన పీలేరు లోని షాప్ నంబరు 11లో నిత్యావసర వస్తువుల పంపిణీ కొనసాగుతోందని తెలిపారు. కాబట్టి, అర్హత కలిగిన అన్ని రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఈనెల 17వ తేదీ లోపు తమ రేషన్ సరుకులను తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నమండెం మే 16 ప్రభాతవార్త:



మండలంలోని కేశపురం గ్రామం దేవళంపేట లో రాయచోటి మదనపల్లి ప్రధానరహదారిలో శుక్రవారం సాయంత్రం కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో సుభాష్ చంద్రబోస్ తీవ్రంగా గాయపడ్డాడు.వివరాలలోకి వెళితే రాయచోటికి చెందిన సుభాష్ చంద్రబోస్ హైదరాబాద్ కు చెందిన బయో ప్యాక్ ఇన్‌పుట్స్ ప్రవేట్ లిమిటెడ్ రసాయనిక ఏరువుల కంపెనీలో చిత్తూరు జిల్లా సేల్స్ రిప్రజంటీవ్ గా పనిచేస్తున్నాడు.ఇతను మదనపల్లి లో తనపని ముగించుకొని ద్విచక్ర వాహనంలో బయలుదేరి కేశాపురం గ్రామం దేవళంపేట మీదుగా వెళుతుండగా అదేసమయంలో రాయచోటి వైపు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బోస్ కు కాలు విరిగింది.అలాగే నడుము క్రింది భాగంలో తీవ్ర గాయాలయ్యి తీవ్ర రక్త స్రావం అయింది. వెంటనే పోలీసులు ప్రజలు ఆయనను హుటాహుటిన 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి అదే స్పీడుతో వెళ్లి ఆగి ఉన్న మరొక కారును ఢీ కొన్నట్లు సమాచారం .ఈ మేరకు బాధితుని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు.. ఆటో ఢీ.. ఐదుగురికి గాయాలు

మదనపల్లి మే 16 ప్రభాత వార్త

ఆర్టీసీ బస్సు ఆటో ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకలో నివాసముంటున్న షేక్.రెడ్డి భాష శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి నిమ్మనపల్లెలోని సయ్యద్ షా వల్లి దర్గా వద్ద జరుగుతున్న ఉరుసు చూడడానికి నిమ్మనపల్లి కు వెళ్లారు. అనంతరం నిమ్మనపల్లి నుంచి స్వగ్రామం సింగంవారిపల్లె కు వెళ్లడానికి చిన్నళ్లవారిపల్లెకు చెందిన పఠాన్.ముస్తఫా కు చెందిన ఆటోలో వెళుతుండగా మార్గమధ్యలోని సైదాపేట మలుపు వద్ద మదనపల్లి నుంచి కందూరు కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా ఒకే కుటుంబానికి చెందిన షేక్.రెడ్డి భాష(46), ఫేక్.తాజున్ బి (40), షేక్.ఇమ్రాన్ (17), షేక్.అసిఫా (14) లతోపాటు ఆటో డ్రైవర్ పఠాన్.ముస్తఫా (60) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. అనంతరం క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పోలీసులు సంఘటనా స్థలానికి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మిట్స్ లో లెర్నింగ్ డేటా పై అంతర్జాతీయ సమావేశం

కురబలకోట మే 16 ప్రభాతవార్త



మదనపల్లె సమీపం లోని , మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్)లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగం వారు కంప్యూటింగ్ మరియు ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌పై రెండవ అంతర్జాతీయ సమావేశం ను నిర్వహించినారు. ప్రపంచ పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు మరియు విద్యార్థులు కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ మరియు ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌లో సహకరించడానికి మరియు ఆవిష్కరణలను పంచుకోవడానికి ఈ సమావేశంను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని బెంగళూరులోని ఎల్‌టిఐ మైండ్ట్రీలో సీనియర్ టెక్నికల్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న బావాజీ దొరగింటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఏ.ఐ యొక్క పరివర్తన పాత్రను ఆయన వివరించారు. వైఫల్యాలను విజయానికి మెట్లుగా చూస్తూ, స్థిర మైన మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని ఆయన పాల్గొనేవారిని ప్రోత్సహించారు. నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌లో పోటీతత్వంతో ఉండటానికి తాజా సాంకేతిక ధోరణులతో తాజాగా ఉండాలని కూడా ఆయన విద్యార్థులను కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇకపై కేవలం భవిష్యత్ భావన కాదు ఇది పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థలు మరియు సమాజాలను పునర్నిర్మించే ఆవిష్కరణల తరంగం వెనుక ఉన్న చోదక శక్తి అని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పరిశోధన ప్రపంచ వ్యాప్తంగా వేగవంతం అవుతున్నందున, మనం జీవించే మరియు పనిచేసే విధానాన్ని నేర్చుకోవడం, స్వీకరించడం మరియు మార్చగల సామర్థం గల మేధో వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో సంస్థలు మరియు పరిశోధకులు ముందంజలో ఉన్నారని అన్నారు. ఏ.ఐ పరిశోధన యంత్ర అభ్యాసం, సహజ భాషా ప్రాసెసింగ్, కంప్యూటర్ దృష్టి, రోబోటిక్స్ మరియు లోతైన అభ్యాసంతో సహా బహుళ డొమైన్‌లలో విస్తరించి ఉంది అని, ఈ సాంకేతికతలు ఆరోగ్య సంరక్షణ విశ్లేషణలు, స్వయంప్రతిపత్త వాహనాలు, వాతావరణ నమూనా, వ్యక్తిగతీకరించిన విద్య, ఆర్థిక అంచనా మరియు మరిన్నింటిలో పురోగతులను సాధ్యం చేస్తున్నాయి అని అన్నారు. డేటా ఆధారిత ఖచ్చితత్వంతో పరిశోధకులు ఉన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా, మానవయంత్ర సహకారం ద్వారా సాధ్యమయ్యే వాటిని పునర్నిర్వచిస్తున్నారు అని అన్నారు. దేశ నలు మూలల నుంచి ఎంతో మంది పరిశోధనలు చేసారని, వారి పరిశోధనలు ఇక్కడ ప్రదర్శించడం వారి ఐడియా లు పంచుకోవడం జరిగిందని వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ అన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సుమయా సనోబర్, డాక్టర్ పి. రామనాథన్ వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ గౌతమ్ చక్రవర్తి, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదన్ , కన్వీనర్ డాక్టర్ కె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

# మనమిత్ర యాప్ సేవలు వినియోగించుకోవాలి



రామసముద్రం మే 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనమిత్ర అనే కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ కూడా 161 పౌర సేవలు వాట్సప్ ద్వారా సర్వీసెస్ అందించే కార్యక్రమం చేపట్టడమైంది. ఎంపిడిఓ భానుప్రసాద్ మాట్లాడుతూ మనమిత్ర యాప్ పై ప్రజలందరికీ అవగాహన చేయాలనే ఉద్దేశంతో అన్ని గ్రామ పంచాయతీ సచివాలయాలకు మన మిత్రకి సంబంధించి రోల్ అఫ్ స్టాండ్స్ అందజేయడం జరిగింది. మండలం లోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శులు కు శుక్రవారం అందజేయడం జరిగిందని . వీటిని అన్ని గ్రామ సచివాలయంలో డిస్ప్లే చేయడం జరుగుతుందన్నారు . ఇక్కడ ఉన్న క్యూ ఆర్ కోడ్ ద్వారా డైరెక్ట్ గా కావాల్సిన సర్వీసెస్ వాట్సాప్ ద్వారా పొందే అవకాశం ఉందని . కావున ప్రజలు అందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలనిక ఎంపిడిఓ భానుప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భానుప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఓ గపూర్, పంచాయతీ సెక్రటరీలు మునిస్వామి నాయక్, రెడ్డి శేఖర్,విద్యావతి,రెడ్డి రామయ్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో కిలాడీ లేడీ ముఠా అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం, మే 16, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ, ప్రొద్దుటూరు ఎస్‌డిపీవో పి.భావన ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు 2వ పట్టణ ఇన్స్పెక్టర్ సదాశివయ్య సూచనల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్రారెడ్డికి రాబడిన సమాచారం తో ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని వాసవీ సర్కిల్ వద్ద కొనుగోలు ముసుగులో దొంగతనం చేసిన కిలాడీ ముఠాను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్నగాల్ల కమ్మువారుపల్లి రామాంజనమ్మ, పోలా నాగవేణి, మన్నూరు లక్షుమ్మలను మహిళా పోలీసుల సమక్షంలో శుక్రవారం అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి 20 గ్రాములు బరువు గల 4 సాదా బంగారు ఉంగరాలు రూ.1.90లక్షలు విలువ గలవి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసు చేదన, రికవరీలో విశేష కృషి చేసిన పీసీ గురుశేఖర్, రవీంద్రనాయక్‌లను ఎస్పీ, ఎస్‌డీపీవోలు అభినందించారు.

# నగర పంచాయతీ కాదు.. మున్సిపాలిటీయే..

జమ్మలమడుగు, మే 16, ప్రభాతవార్త:



నగర పంచాయతీ కాదు.. ఇక మీదట జమ్మలమడుగు మున్సిపాలిటీ అని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి చొరవతో గ్రేడ్-3 మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చర్య వల్ల నగర పంచాయతీ నుంచి జమ్మలమడుగు మున్సిపాలిటీగా ప్రకటించడం జరుగుతుంది. గ్రేడ్-3గా మార్చడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఎక్కువగా వచ్చి పట్టణం బాగా అభివృద్ధి దిశగా పయనిస్తుంది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న జమ్మలమడుగును నగర పంచాయతీగా మూర్చగడంలో కూడా ఎమ్మెల్యే కృషి ఉంది. రాబోయే రోజుల్లో పట్టణ ప్రజల సహకారంతో గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2గా మారితే మున్సిపల్ సిబ్బంది పెరగడం, అభివృద్ధి ఎసేవలు పెరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్‌ను ఛైర్‌పర్సన్‌ను, మున్సిపల్ సిబ్బందిని కలిసి పలువురు అభినందించారు.

# 9 మంది పందెం రాయుళ్లు అరెస్టు.

## రూ .2,83,350 స్వాధీనం.

పీలేరు మే 16 ప్రభాతవార్త:

తొమ్మిది మంది కోడి పందెం రాయులను అరెస్టు చేసినట్లు సిఐ గురునాథ తెలిపారు.మండల కేంద్రమైన కలకడ సమీపంలో ఉన్న కలకడ గ్రామానికి చెందిన కొత్తపల్లి సమీపంలోని మామిడి తోపులో కోడి పందెం ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.ఈ దాడులలో కోడి పందెం ఆడుతున్న నాగులు బండకు చెందిన నాగేశ్వర్ నాయుడు, తాటి గుంట పల్లెకు కి చెందిన హేమచంద్ర, గంగాపురానికి చెందిన చంద్రబాబు నాయుడు, నడిమిచర్లకు చెందిన ప్రభు కుమార్, కోనకు చెందిన ముబారక్, గంగాపురం చెందిన శివకుమార్ ,దొడ్డిపల్లి కి చెందిన రాజన్న, భాస్కర నాయుడు, దేవలపల్లికి చెందిన భూపతిలను పట్టుకుని వారి వద్ద నుండి సుమారు రూ.2,83,350/ ను స్వాధీనం చేసుకొని 9 మందిని అరెస్ట్ చేసినట్లు చేసినట్లు సిఐ తెలిపారు.ఈ దాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

# 16 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

కలికిరి, మే 16, ప్రభాతవార్త:

కలికిరి-సదుం రోడ్డు మార్గంలో శుక్రవారం పేకాట ఆడుతున్న 16 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,50,850 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కలికిరి పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మదనమోహన్‌రెడ్డి తెలిపారు. కలికిరి-సదుం రోడ్డు మార్గంలో పేకాట ఆడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు నిఘా ఉంచి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు సమాచారం అందించారు. దీంతో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి నిందితులను అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ రాయచోటి నుంచి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. దీంతో శుక్రవారం రహస్యంగా పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 16 మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, స్కూటర్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసఉకొని కలికిరి పోలీసులకు అప్పగించారు. దీంతో మదనమోహన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రక్తహీనత అనేక రుగ్మతలకు మూలం.



రక్తహీనత నివారణను సూచస్తున్న సిడిపిఓ.

చిట్వేలి, మే 16, ప్రభాతవార్త:

పరిమాణం కంటే తక్కువ స్థాయిలో రక్తం ఉండడం పలు రుగ్మతలకు దారి తీస్తుందని చిట్వేలి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ నిర్మలా జ్యోతి అన్నారు. శుక్రవారం కిశోరీ వికాసం వేసవి శిబిరం 5 సెషన్లో భాగంగా బాలికలు కౌమార దశలో ఎదుర్కొనే రక్తహీనత సమస్యలను, అధిగమించే మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ ముఖ్యంగా కౌమార దశలో నెలసరి సమయంలో రక్తహీనత సమస్య ఏర్పడుతుందన్నారు. పరిశుభ్రతను పాటించడం, సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, సరైన అవగాహన పెంచుకోవడంతో ఇబ్బందిని అధిగమించవచ్చని తెలిపారు. ఏఎన్ఎం పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఐరన్,ఫోలిక్ యాసిడ్ మందులను సూచించిన విధంగా వాడాలన్నారు. ఇబ్బందిని దాచుకోకుండా వైద్యులను సంప్రదించి సరైన చికిత్సను సకాలంలో పొందాలని తెలియపరిచారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు వసుంధరమ్మ, సురేఖ రాణి, విశాలాక్షి, మహిళా పోలీసు అమరావతి, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

# ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలి



లక్కిరెడ్డిపల్లె: ఏప్రిల్ 16 ప్రభాత వార్త

శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్ల ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ప్రార్థించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండలం లోని పందిళ్ళపల్లి గ్రామం జమకలగుట్ట వడ్డేపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున జరుగుతున్న పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు.కార్యక్రమ నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి కి ఆత్మీయ స్వాగతం పలికి,ఆయన చేత ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి,తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేవుడి దయవల్ల వర్షాలు సంవృద్దిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వైభవంగా స్వామి,అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలోఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబా బత్తిన రెడ్డయ్య, సర్పంచ్ లు మహేంద్ర బాబు, జనార్ధన్ రెడ్డి, వెంకట్ నారాయణ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు మల్ రెడ్డి, ఢిల్లీ విశ్వనాథరెడ్డి, లక్ష్మిరెడ్డి, రమణ, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ భాషా,జాకీర్,నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

జమ్మలమడుగు, మే 16, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మాసం 3వ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాత బస్టాండు వద్ద వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజలలో అవగాహన పెంచడానికి మరియు పట్టణ, గ్రామీణ స్థితి స్థాపకలను మెరుగుపరచడానికి దృష్టి సారించిన కార్యకలాపాలను చేపట్టాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఈ సందర్భంగా ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు, కోఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రజలు తప్పక హాజరు కావాలని కోరారు.

# రైతులకు అవగాహన కార్యక్రమం

పెండ్లిమర్రి, మే 16, ప్రభాతవార్త:

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెండ్లిమర్రి సచివాలయంలో శుక్రవారం రైతులకు పండ్ల, పూల మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు తమ గ్రామంలో ఉన్న ఖాళీ భూముల వివరాలతో గ్రామ పంచాయతీ పరిధిలో అర్హులైన, ఆసక్తి గల రైతులను గుర్తించే ప్రక్రియలో భాగంగా శుక్రవారం మొదటి గ్రామ సభ నిర్వహించారు. రైతులు గ్రామ సభలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసి మండల స్థాయి కమిటీ అధికారులు, గ్రామ సభలకు హాజరై ఉపాధి హామీ పథకం మరియు హార్టికల్చర్ శాఖలో ఇస్తున్న ప్లాంటేషన్ పనులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆసక్తి, అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 22 రకాల పండ్ల తోటలను పూర్తి ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. మామిడి, చీనీ, సన్న, నిమ్మ, జామ, తైవాన్ జామ, కొబ్బరి తదితర పండ్ల మొక్కలు ఇవ్వడం జరుగుతుంది. అలాగే పూల తోట మొక్కలు కకూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఏడీ సుభాషిని, హెచ్‌ఓ సింధూరి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, వీఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

# నేడు కళ్యాణ మహోత్సవం

లక్కిరెడ్డిపల్లి : మే 16 ప్రభాత వార్త

మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామం జంకల వడ్డేపల్లిలో నేడు అంగరంగ వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు , గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఉదయం ప్రాతః కాల పూజ , హోమము అనంతరం 10:30 గంటల నుంచి 12 గంటల లోపల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరుగుతుందన్నారు. కళ్యాణోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం ఏడు గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం మేల తాళాలతో , బాణ సంచాలతో , చెక్కభజనలతో, కోలాట బృందాలతో అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. కావున యావన్మంది భక్తాదులు కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు , గ్రామ ప్రజలు కోరారు.

బాలికలు కౌమార దశలో

# రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్త వహించాలి





**రామాపురం మే 16, ప్రభాతవార్త:**

కౌమరదశలో బాలికలు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్లు హుస్సేనమ్మ పద్మజ రాణి పేర్కొన్నారు మండలంలోని రామాపురం సెక్టార్ పరిధిలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపువాండ్ల పల్లిలో గువ్వల చెరువు సెక్టార్ కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం శుక్రవారం సిరియస్ అంగన్వాడి కేంద్రంలో సమ్మర్ కోచింగ్‌లో భాగంగాకిషోర్ బాలికల వికాసం లో కౌమార దశలో రక్తహీనత తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై 11 నుండి18 సంవత్సరాల కిషోర్ బాలికలకు రక్తహీనత వల్ల జరుగు అనర్థాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూపర్వైజర్లు మాట్లాడుతూ రక్తహీనత ఏర్పడానికి కిషోర్ బాలికల్లో నెలవారి రుతుస్రావం సమయంలో రక్తం వెళ్లిపోవడం వల్ల కడుపులో నులిపురుగులు వల నులిపురుగుల నివారణకు ఆరు నెలలకుఒక పర్యాయము ఆన్ బెండజోల్ టాబ్లెట్లు వేసుకోవాలన్నారు వారానికి ఐరన్‌టాబ్లెట్స్ తీసుకోవాలన్నారు. రోజు వారి ఆహారంలో ఆకుకూరలు పాలు గుడ్లు పప్పు దినుసులు చిరుధాన్యాలు ఉండేలా సమపాలలో ఉండేలా ఆహారం తీసుకోవాలి అన్నారు వ్యక్తిగత పరిశుభ్రత తీసుకోవాలన్నారు కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కళ్యాణి సచివాలయం మహిళాపోలీస్లు ఆరోగ్య సిబ్బంది కిషోర్‌బాలికలు తల్లులు పాల్గొన్నారు.

# రాజంపేట మున్సిపల్ సమావేశం రసా బాసా

సమావేశాన్ని బహిష్కరించిన 11 మంది కౌన్సిలర్లు.. ప్రజలకు జవాబుదారిగా పని చేయాలి... ఎంపి మేడా రఘునాథరెడ్డి



పాల్గొన్న ఎంపీ రఘునాథరెడ్డి ,ఎమ్మెల్యే అమర్, చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి



సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్న టిడిపి సభ్యులు

**రాజంపేట అర్బన్, మే 16 ప్రభాతవార్త**

మున్సిపల్ పాలకవర్గ సమావేశం వాడి వేడిగా జరిగింది. అధికార ,ప్రతిపక్ష సభ్యులు అధికారుల పనితీరుపై ధ్వజమెత్తారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాధ్ రెడ్డి హాజరైన ఈ సమావేశంలో అటు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించగా, వైసీపీ సభ్యులు కూడా ఐదు మంది సమావేశం బహిష్కరించి వెళ్లిపోయారు. వైసిపి హాయాంలో ప్రతినెల కౌన్సిల్ సమావేశం జరిపే వాళ్ళని ఇప్పుడెందుకు మూడు నెలలకు ఒకసారి జరుపుతున్నారని టిడిపి కౌన్సిలర్ తుపాకుల అశోక్ కుమార్ ప్రశ్నించారు. సమావేశంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న మూడేళ్లలో ఒక సమస్య పరిష్కారం చేయకుండా ఎందుకు ఈ సమావేశం అని, అందుకే బహిష్కరిస్తున్నట్లు వైసిపి కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. కౌన్సిలర్ల మాటకు విలువ లేనప్పుడు సమావేశం ఎందుకని కుర్ల వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. కౌన్సిల్కు తెలియకుండానే వేలం పాటలు ఎలా నిర్వహిస్తారని కౌన్సిలర్ సూరి, రమణారెడ్డి ప్రశ్నించారు. వేలంపాట పూర్తి అయిన తర్వాత కౌన్సిల్ ఆమోదం తెలపడం ఏమిటని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు మార్కెట్లో గదులను వేలంపాటలో దక్కించుకొని ఏళ్ల తరబడి సొమ్ము చెల్లించకుండా లక్షల రూపాయలుబకాయి పడితే ఏమి చేశారని ప్రశ్నించారు. రెవెన్యూ రికవరీ చట్టం కింద బకాయిలు వసూలు చేయాలని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసినట్లు మేనేజర్ పేర్కొన్నారు. పది రోజులు ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కౌన్సిల్కు హామీ ఇచ్చారు. అధికారుల పనితీరుపై సభ్యులు మండిపడుతుండడంతో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి జోక్యం చేసుకొని కొత్తగా కమీషనర్ వచ్చారని,కొంత ఆయనకు సమయం ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీ వ్యవస్థ అద్వానంగా ఉందని చక్కదిత్య పనిలో ఉన్నట్లు కమిషనర్ జి శ్రీనివాస్లు పేర్కొన్నారు. సభ్యులు లేవనెత్తిన అంశాలను అన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి అన్ని సరిదిద్ది సమన్వయంతో పని చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ప్రతిరోజు పారిశుధ్యం సిబ్బంది 20 మంది విధులకు రావడంలేదన్నారు. మరో 21 మందిని అదనంగా తీసుకుంటున్నట్టు తెలిపారు. దీనిపై కౌన్సిలర్ డొంక సూరి ధ్వజమెత్తారు. ఇప్పటికే 106 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, ఇంకా ఎంతమందిని పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఉన్నవారంతా ఎక్కడ పని చేస్తున్నారని నిలదీశారు. పారిశుద్ధ కార్మికులను మిగతా విభాగాలకు ఎలా పంపుతారని మండిపడ్డారు.

# మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు





**బద్వేలు, మే 16, ప్రభాతవార్త ;**

పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో వెలసివున్న శ్రీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ మూలవిరాట్ కును అదేవిధంగా గర్భలాయయంతోపాటు అంతరాలయంలో సరికొత్తగా మామిడి కాయల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు.ప్రత్యేక అలంకరణలో వున్న అమ్మవారిని దర్శించుకున్న భక్తులు విశేష పూజలు అర్చనలను చేపట్టారు. దుర్గమ్మ ఆలయంలో ఈరోజు అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం సందర్భంగా ఈరోజు అన్నప్రసాద వితరణ (అన్నదానం ) కార్యక్రమం సమర్పించిన వారు కీ శే! ! కనిశెట్టి రమణయ్య ధర్మపత్ని కుమారి వీరి కుమారులు రాధా కృష్ణ. మురళి కృష్ణ, శివా శంకర్ ప్రసాద్ RK బ్రదర్స్ రాధా కృష్ణ హోటల్ నెల్లూరు రోడ్ బద్వేల్.

## వెల్లాలలో వసంతోత్సవం సంబరాలు, శ్రీచక్రస్నానం





**రాజుపాళెం, మే 16,ప్రభాతవార్త.**

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శుక్రవారం బ్ర హ్మోత్సవాలు ముగింపు రోజున శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ చెన్నకేశవస్వామికి వేదపండితు లు భక్తులు ప్రత్యేక పూజలు ని ర్వహించి వసంతాలు తొలుత స్వామివారి పైన చల్లుటతో ప్రా రంభమై కార్యక్రమంలో పాల్గోన్న వారందరు ఒకరిపైన మరోకరు వసంతాలు చల్లుకొనుచూ ఎంతో సంబరంగా కుందూనదికి ఊరే గింపుగా వెళ్ళి స్వామివారికి వేదపండితులు మంత్రోచ్ఛరణలతో స్నానం ఆ చరించి, స్వామివారిశ్రీచక్రంను భక్తులతో కలిసి పండితులు నదిలోకి తీసుకెళ్ళి శాస్రోక్తంగా చక్రస్నానం కార్యక్రంను వైభవంగా నిర్వహించారు.అనంతరం ఆల యం వరకు మహిళలు కీర్తనలుఆలపిస్తూ,భజనలు చేస్తూ స్వామివారి ఊరేగిం పు కార్యక్రమంను నిర్వహించారు.బ్రహ్మోత్సవాల ప్రారంభంరోజున ధ్వజస్తం భం పైన ఎగురవేసిన శ్రీఆంజనేయస్వామి చిహ్నాం కల్గిన పతాకంను రాత్రివేళ క్రిందకుదింపి ధ్వజాఅవరోహన కార్యక్రమం నిర్వహించి బ్రహ్మోత్సవాలు ముగింపు పలికారు. ఈ కార్యక్రమంలో ఉత్సవకమిటి చేర్మేన్ జి.ఎల్.నారాయణ రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, పద్మావతమ్మ, సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీన రశింహ్మారెడ్డి, సీనియర్‌అసిస్టంట్ రామ్మోహన్ తదితరలు పాల్గోన్నారు.

## ఘనంగా చౌడేశ్వరీ గ్రామోత్సవం



**గాలివీడు, మే 16 ప్రభాతవార్త:**

మండలంలోని పూలికుంట గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవత గ్రామోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేకువజామునే వేదపండితులు సుబ్రమణ్యంశర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహదాత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి కుటుంబీకులచే ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో ఉంచి 12 పల్లెలలో గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం మూలవిరాట్‌మూర్తికి పూలికుంట వంశస్తులచే ప్రధమపూజలు నిర్వహించడంతో జాతర ఆరంభం అవుతుంది. రాత్రికి నిండు తిరునాళ్ల ఆదివారం మైల తిరునాళ్ల జరుగుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## స్మశాన వాటికలను ప్రతి గ్రామానికి నిర్మించాలని దృఢ సంకల్పం.

ప్రతి గ్రామానికి స్మశాన వాటిక నమూన,

**మైదుకూరు, మే 16, ప్రభాతవార్త:**

మైదుకూరు నియోజకవర్గంలో స్మశాన వాటికలను ప్రతి గ్రామానికి నిర్మించాలని దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేపట్టిన ప్రణాళిక ఆరంభమైంది. నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో మండలానికి 5 వంతున స్మశాన వాటికలు మొదటి విడతగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మంజూరు చేయించారు. శనివారం మండలానికి ఒకటి వంతున స్మశాన వాటికకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపన నోచుకుంటున్న స్మశాన వాటిక నమూనాలు ఇక గ్రామాలకు వెళ్తే.ఇలాంటి నమూనా కలిగిన స్మశాన వాటిక సిద్ధం కాబోతున్నాయి.

# సీట్‌బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**సంబేపల్లి మార్చి 16 ప్రభాతవార్త:**



మండలంలోని నారాయణరెడ్డి పల్లె గ్రామం కొండావాండ్లపల్లి క్రాస్ వద్ద శుక్రవారం ఎస్సై భక్తవత్సలం వాహనాలు తనిఖీ చేపట్టారు వాహనాల పత్రాలు సరిగా లేని వారికి హెల్మెట్ ధరించిన వారికి సీట్ బెల్ట్ ధరించని వారికి, పత్రాలు సరిగా లేనివారికిసుమారు 50 మందికి జరి మాన విధించామన్నారు ఈ సందర్భంగా ఎస్ఐ భక్తవత్సలం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాల పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలన్నారు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ ను తప్పనిసరిగా ధరించాలని అలా ధరించడం వలన ప్రాణాపాయం నుండి బయటపడవచ్చు అన్నారు ప్రతి ఒక్కరురోడ్డు భద్రత నియమాలు పాటించి వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు తనికీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సంఘం కమిటీ ఏర్పాటు



**బద్వేల్ అర్బన్, మే 16, ప్రభాతవార్త**

స్థానిక మత్స్య సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం మత్స్య సహకార సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో బద్వేలు మత్స్య సహకార సంఘం గౌరవాధ్యక్షులుగా బోలా నారాయణను ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షునిగా కందుకూరి చిన్న చెన్నయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా రొయ్యల కృష్ణ, సెక్రటరీగా నాగేటి రవి, డైరెక్టర్లుగా కణేకంటి శ్రీనివాసులు,గగ్గర శీను, బోలా కుమార్, జింక పెంచలయ్య, బోయిన రాముడు, బోయిన సుబ్బయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం నూతన పాలకవర్గం మాట్లాడుతు నూతన కమిటి ఏర్పాటుకు సహకరించిన మత్స్యకారులకు ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# ముగిసిన తిరునాళ్ల మహోత్సవం



**సిద్ధవటం మే 16 ప్రభాతవార్త**

మండలంలోని మాచుపల్లి గ్రామంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న రేణుక ఎల్లమాంబ తిరుణాల మహోత్సవం శుక్రవారం రేణుక ఎల్లమాంబ, సమేత జమదగ్ని మూల విరాట్ ఉత్సవ విగ్రహాలు డప్పు వాయిద్యాల మధ్య ఒకరినొకరు వసంతాలు రంగులు పూసుకుంటూ గ్రామోత్సవం వైభవంగా జరిగింది ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ రేణుక ఎల్లమాంబ తిరుణాల మహోత్సవాలు గత ఐదు రోజులుగా జరుగుతున్నాయని శుక్రవారం వసంతాల వేడుకలతో ముగిశాయని ఉత్సవ మహోత్సవాలకు సహకరించిన దాతలకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మజ్జిగ వితరణ అభినందనీయం

ఆర్యవైశ్య వర్ధక సంఘం అధ్యక్షులు కేవి సుబ్బారావు



**బద్వేల్ అర్బన్, మే 16, ప్రభాత వార్త**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బెంగుళూరు కు చందన పైడా సురేష్ బాబు, సతీమణి వాణి శైలజల కుమార్తె సాత్విక శుక్రవారం బద్వేలు లోని మైదుకూరు రోడ్ మంచినీటి చలివేంద్రం వద్ద మజ్జిగ వితరణగా అందించారు. కార్యక్రమాన్ని పత్తి పద్మావతి, అడ్వకేట్ పత్తి నాగేంద్రప్రసాద్, హేమలత ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వర్ధక సంఘం అధ్యక్షులు కే,వీ సుబ్బారావు తుమ్మలపెంట సురేష్ బాబు, తులసి వెంకట శివ నారాయణ, జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం) వాసవి క్లబ్ అధ్యక్షులు అనుమల శెట్టి సిద్దయ్య, కొలిశెట్టి సుబ్బారావు తో పాటు పలువురి చేతుల మీదుగా మజ్జిగ ను అందించారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రాధతో పాటు పలువురు పాల్గొన్నారు.



# వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం

**జమ్మలమడుగు, మే 16, ప్రభాతవార్త:**

కన్నుల పండువగా శుక్రవారం శ్రీ నారాపుర వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ మహోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, శ్రీమతి అరుణమ్మలు సతీసమేతంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు శివనారాయణరెడ్డి, శ్రీమతి జయశ్రీలు పాల్గొన్నారు.

### నేడు నారాపుర స్వామి రథోత్సవం

శనివారం ఉదయం 7.30 గంటలకు శ్రీ నారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు ఎన్‌డీఏ కూటమి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డిలు పాల్గొంటున్నారని జమ్మలమడుగు నియోజకవర్గం కూటమి నాయకులు తెలిపారు.



# సుభాష్ చంద్రబోస్ ఆప్డద ప్రబంధన్ పురస్కార్2026 కు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా అగ్నిమాపక అధికారి

**కడప, మే 16: ప్రభాతవార్త:**

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ వారి సూచనలతో, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి వారి ఆదేశాల మేరకు సుభాష్ చంద్రబోస్ ఆప్డద ప్రబంధన్ పురస్కార్2026 కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 సంవత్సరానికి సంబంధించిన ఈ పురస్కారం కోసం ఆన్‌లైన్‌లో https://awards.gov.in అనే పోర్టల్ ద్వారా 30.09.2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం విపత్తు నిర్వహణ రంగంలో అద్భుతమైన సేవలందించిన వారికి, ఇన్స్టిట్యూషన్స్ కు"సుభాష్ చంద్రబోస్ ఆప్డద ప్రబంధన్ పురస్కారం"ను అందజేస్తోందని తెలిపారు.పూర్తి వివరాలు మరియు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ https://awards.gov.in అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవ కాశాన్ని వినియోగించుకొని, తమ సేవలకు గుర్తింపును పొందేందుకు నిర్ణీత సమయంలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.
















అన్నమయ్య జిల్లా

నందలూరు, ఒబులవారిపల్లె, వీరబల్లి మొలకలచెరువు, బి కోత్తకోట, పెద్దతిప్పసముద్రం రాయచోటి రూరల్, రాయచోటి అర్బన్

కడప జిల్లా

కడప క్రైం, కడప కలెక్టరేట్, సికెదిన్నె వల్లూరు, కల్సపాడు, మైదుకూరు రూరల్ అట్లూరు, వేముల, మైలవరం జమ్మలమడుగు రూరల్, పులివెందుల రూరల్

ఇంటర్వ్యూ తేదిలు : 15.05.2025 నుండి 20.05.2025 వరకు మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086